క్లుప్తంగా

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చిలకలూరిపేట: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో నిర్వహించే ఈ సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.

సాతులూరులో ఆధార్ క్యాంపు



నాదెండ్ల: సాతులూరు గ్రామంలోని 2వ సచివాలయంలో బుధవారం ఆధార్ కేంద్రం నిర్వహించారు. చిన్నారులకు జనన ధృవీకరణ పత్రం ఆధారంగా నూతన ఆధార్ కార్డులను నమోదు చేశారు. కార్డుల్లో తప్పులు, సవరణలు, ఫోన్ నెంబరు లింకేజీ చేశారు. గురువారం గొరిజవోలు గ్రామంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయనున్నందున గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి కార్యదర్శి రాఘవయ్య కోరారు.

రెవెన్యూ అధికారికి సన్మానం



నాదెండ్ల: తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా పనిచేస్తూ పదోన్నతి పొందిన నీలి ధనలక్ష్మి బుధవారం రిలీవ్ అయ్యారు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు పెదకూరపాడు తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రస్తుత తహసీల్దార్ ఏవీ రమణ, వీఆర్వోలు, వీఆర్ఏలు, సిబ్బంది ఆమెను శాలువాలతో సత్కరించి నూతన వస్త్రాలు బహూకరించారు. భవిష్యత్‌లో మరిన్ని పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు.

ట్రాక్టరు బోల్తా పడి యువకుడి మృతి



శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం గ్రామ సమీపంలో అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో ట్రాక్టరు బోల్తా పడి యువకుడు బుధవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన బండారు ఫణీంద్ర (26) అడ్డరోడ్డు నుంచి శావల్యాపురంలోని కొంకెరు వాగు పరిధిలో రైల్వే ట్రాక్ పనులు నిమిత్తం ట్రాక్టరుపై కంకరు రాళ్ళు లోడుతో వస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టరు ముందు టైరు పేలిపోవటంతో ఒక్కసారిగా ట్రాక్టరు రోడ్డు పక్కనే తిరగబడింది. సంఘటన స్థలంలో ట్రాక్టరు డ్రైవరు బండారు ఫణీంద్ర మృతి చెందాడు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలు సేకరించి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషను రైటరు షేక్ బాషా తెలిపారు. మృతుడికి పది నెలల క్రితమే వివాహం అయింది. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఉచిత మెగా కంటి వైద్యశిబిరం



వినుకొండ(నూజెండ్ల): పట్టణ న్యాయవాద సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ యంవి రెడ్డి కంటి ఆసుపత్రి నరసరావుపేట వారి సౌజన్యంతో బుధవారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరంను వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఎం.మహతి ప్రారంభించారు. ఈ కంటి వైద్య శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు చేసి రాయితీపై కళ్ళజోళ్ళు, మందులు ఇవ్వడం జరుగుతుందని న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు, కోర్టు సిబ్బంది, పోలీసులు, కక్షిదారులు అందరికీ కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని న్యాయవాద సంఘం సభ్యులు తెలియచేశారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.ఎస్.ఎం.వి.నాయుడు, సెక్రెటరీ పఠాన్ గౌస్ మొహి ద్దిన్ ఖాన్, వైస్ ప్రెసిడెంట్ గాలి నాగరాజు జాయింట్ సెక్రెటరీ యలవర్తి శ్రీనివాసరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కోటప్పకొండ స్థల పురాణ టీజర్ విడుదల



నరసరావుపేట: స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం కోటప్పకొండ స్థల పురాణం యధార్థ గాథ టీజర్‌ను శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు విడుదల చేశారు. ఈ స్థలం పురాణం ఎమ్మెల్యే సారథ్యంలో జరుగుతుందని దర్శకులు నరేష్ దోనే మణివరన్ తెలియచేశారు. ఈ సందర్భంగా దర్శకుడిని ఎమ్మెల్యే సన్మానించారు.

వల్లప్ప చెరువులో ఇదేందప్పా?

ఎంతో సదుద్దేశ్యంతో పూర్వీకులు ఏర్పాటు చేసినవి చెరువులు. ఆ పరగణాలో భూగర్భ జలాల పెరుగుదల కోసం, పశు- పక్ష్యాదులకు సైతం నీటి అవసరాలు తీర్చుతాయన్న సత్సంకల్పంతో భారీగా వీటిని ఏర్పాటు చేశారు ఆ పెద్దలు. అయితే వారి ఉద్దేశ్యానికి కొందరు తూట్లు పొడుస్తు చెరువులను పాడు చేస్తూ భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేస్తున్నారు. అందరి అవసరాలకు ఉపయోగ పడుతున్న వల్లప్ప చెరువుదీ ఇదే పరిస్థితి. చెత్త, చెదారాలతో చెరువు గట్లను పూడ్చేస్తున్నారు కొందరు ప్రబుద్ధులు!



వల్లప్ప చెరువు కట్టపై పడేసిన చెత్త, బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్

- చెత్తతో నిండుతున్న చెరువు కట్ట
- ఆందోళన చెందుతున్న రైతులు, పట్టణ వాసులు
- చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు పలువురు వినతి

నరసరావుపేట: పట్టణానికి ఉత్తరంవైపున ఏడాదికి పదిమాసాల పాటు నీటితో నిండుకుండలా ఉంటూ నివాసితుల బోరింగ్ పంపులకు భూగర్భ జలాలను అందించే వల్లప్పచెరువు అధికారుల నిర్లక్ష్యంతో వల్లకాడు అయ్యే పరిస్థితులు కన్పిస్తున్నాయి. సుమారు వందేళ్లకుపైగా చరిత్రల కల్గిన ఈ చెరువు గతంలో 26ఎకరాల్లో ఉండేది. క్రమంగా దాని వస్తీర్ణం తగ్గిపోతూ వస్తోంది. గతంలో దీని చుట్టుపక్కల ఉన్న భూములను ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు పట్టాలుగా అందజేసింది. అయితే వారు క్రమేణా వాటిని అమ్ముకొని వెళ్లిపోయారు. ఇప్పుడు భూములకు రెక్కలు రావటం, జిల్లా కేంద్రంగా నరసరావుపేట స్థిరపడటంతో చుట్టుపక్కల ఉన్న భూమికి విపరీతమైన గిరాకీ ఏర్పడింది. దీంతో పాటు పట్టణానికి దూరంగా ఉంటూ ఎప్పుడూ నీటితో నిండి ఉంటుండటంతో ప్రశాంతమైన వాతావరణానికి చిరునామా ఆ ప్రాంతం వెలిసింది. రియల్టర్లు చెరువుకు ఎదురుగా పట్టణంవైపున ఉన్న భూములను కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణం చేసి విక్రయాలు చేస్తున్నారు. స్థలాలు కొని ఇళ్లు నిర్మించుకోలేని వ్యక్తులు ఆ ఇళ్లను కొనుగోలుచేసి అందులో నివాసాలు ఉంటున్నారు. అంతేగాకుండా ఈ చెరువుకు సమీపంలో శ్రీ గంగా మహాలక్ష్మి, శ్రీ కేదారనాథ సోమేశ్వరస్వామి, శ్రీ షిరిడీసాయి బాబా దేవాలయాలు నిర్మాణం చేసుకున్నాయి. భక్తజనకోటి ఈ దేవాలయాలను సందర్శించి పూజ లు చేస్తున్నారు. గత పదేళ్ల క్రితం నిర్మానుష్యంగా ఉండే ఈ ప్రదేశం ఇప్పుడు జనసంచారంతో కళ కళలాడుతోంది. అలాగే చెరువు నీటిపై ఆధారపడి పలువురు రైతులు తమ పొలాల్లో కంది, పూలతోటలు, మొక్కజొన్న పంటలు వేశారు. ఈ నేపథ్యంలో ఆ చెరువు కట్టను ఆనుకొని వెళుతున్న బైపాస్ రోడ్డుపై కొంతమంది వ్యక్తులు ఎక్కడెక్కడి నుంచో చెత్త, వేస్ట్ బిల్డింగ్ మెటీరియల్, హోటళ్లలోని వ్యర్థపదార్థాలు, బూడిద, చెట్ల కొమ్మలు తీసుకొచ్చి డంపింగ్ చేస్తున్నారు. దీంతో క్రమంగా అవి చెరువులోకి జారుతూ చెరువు మూసుకుపోతుంది. మైనర్ ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు ఎవరూ అటువైపుకు తొంగి చూడకపోవటంతో యథేచ్ఛగా డంపింగ్ జరుగుతుంది. ఇప్పటికైనా అధికారులు కలుగచేసుకొని ఈ వల్లప్పచెరువును కాపాడాల్సిన అవసరం ఉంది.



వల్లప్ప చెరువు కట్టపై చెత్త డంపింగ్ చేస్తున్న ట్రాక్టర్

వల్లప్పచెరువును కాపాడండి

వల్లప్పచెరువు చుట్టూ వేస్తున్న చెత్త డంపింగ్‌ను నిలిపివేసి చెరువును కాపాడాల్సిన అవసరం ఉంది. చెత్త వేస్తుండటంతో ఈ ప్రాంతమంతా కుక్కలు, పందులతో దుర్గంధం వెదజల్లుతుంది. ఈ ప్రాంతంలో ప్రయాణించేవారు ముక్కుమూసుకోని వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. చెరువు కింద పంటలు వేసే రైతులు కూడా ఆందోళన చెందుతున్నారు.
–కుంచాల స్వామి, పట్టణ వినియోగదారుల సంక్షేమ సంఘం

చెత్త తొలగించి శుభ్రం చేయిస్తాం

చెత్తను డంప్ చేస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. నిఘా ఏర్పాటుచేసి చెత్తను వేసేవారిపై చర్యలతో పాటు వేసిన చెత్తను తొలగించేచర్యలు తీసుకుంటాం. ఆ చెరువు చుట్టూ ఉన్న ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పరిరక్షిస్తాం.
–ఎం.జస్వంతరావు, మున్సిపల్ కమిషనర్

వినుకొండలో అక్రమ రిజిస్ట్రేషన్ రద్దుచేయండి

జిల్లా రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేసిన ప్రజాసంఘాల నాయకులు



జిల్లా రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నరసరావుపేట: వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి రెవెన్యూ పరిధిలోని భూమికి చేసిన అక్రమ రిజిస్ట్రేషన్ రద్దుచేసి దీనికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో జిల్లా రిజిస్ట్రార్ రామకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ బ్రాహ్మణపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 256-1ఏలో వై.రోశయ్య కుమారుడు బాల వెంకటసుబ్బయ్య తమ పూర్వీకుల ద్వారా తమకు 1.5 ఎకరాల భూమి వచ్చిందంటూ తన కుమార్తె నాగమణి పేరుతో వినుకొండ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడన్నారు. ఇతనితో కుమ్మక్కు అయిన రెవెన్యూ అధికారులు 158 సెంట్లుగా దానిని మార్చి పాస్ పుస్తకాలు, అడంగల్, ఒన్ బిలో నమోదు చేశారన్నారు. దీనికి రెవెన్యూ రికార్డుల్లో ఆధారాలు, లింకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఏమీ లేవన్నారు. అక్రమంగా అతనిపేరుపై రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. వాస్తవానికి అతనికి పూర్వీకుల ద్వారా సంక్రమించింది కేవలం రెండుసెంట్లు మాత్రమే అన్నారు. ఈ విషయాన్ని స్థానిక తహసీల్దార్‌కు అనేకసార్లు తెలియజేయడం జరిగిందని, బ్రాహ్మణపల్లి రెవెన్యూ సదస్సులో అర్జీ కూడా ఇవ్వటం జరిగిందన్నారు. జిల్లా రిజిస్ట్రార్ స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని తమకు హామీ ఇచ్చారన్నారు. పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, జిల్లా కార్యదర్శి జి. రామకృష్ణ, ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. కోట నాయక్ పాల్గొన్నారు.

ఎంఆర్ టీకాతో తట్టు, రూబెల్లా వ్యాధులు నియంత్రణ

జిల్లా టీకా అధికారి గీతాంజలి



వైద్య ఆరోగ్య సిబ్బందితో సూచనలు చేస్తున్న గీతాంజలి

శావల్యాపురం: తట్టు, రూబెల్లా వ్యాధులు నివారణకు ఎంఆర్ టీకా తప్పనిసరిగా చిన్నారులకు చేయాలని జిల్లా టీకా అధికారి బత్తుల గీతాంజలి అన్నారు. బుధవారం స్థానిక గ్రామసచివాలయంలో జరుగుతున్న టీకా కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గీతాంజలి మాట్లాడుతూ గ్రామాల్లో ఆరోగ్య వైద్య సిబ్బంది ఇంటింటికీ సర్వే చేసి సంవత్సరం లోపు చిన్నారులకు గుర్తించి ఎంఆర్ టీకా చేయించాలన్నారు. తట్టు వ్యాధి సంభవిస్తే జ్వరం ఒంటిపై దద్దుర్లు కళ్ళు ఎర్రగా ఉండటం ఒక్కోసారి స్పృహ తప్పి పడిపోవటం తదితర లక్షణాలు ఉంటాయన్నారు. శిశువు పుట్టగానే 24 గంటల లోపు కామెర్లు వ్యాధి నివారణకు టీకా చేస్తామన్నారు. అదేకాకుండా పెంటా-5 వ్యాక్సిన్,11 రకాల టీకాలు ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు చేయించాలని వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. వలస పనులకు వెళ్లిన చిన్నారులను గుర్తించి అన్ని రకాల టీకాలను చేయాలన్నారు. అనంతరం గ్రామంలో టీకా విధానాన్ని పరిశీలించారు. వైద్యాధికారి రావిపూడి రమ్య, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు అలవలపూడి ఏడుకొండలు, ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్త ఇంకొల్లు నాగలక్ష్మి ఉన్నారు.

ఆరోగ్య సంరక్షణ.. ప్రతి విద్యార్థికి రక్షణ



శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న అంజనీకుమారి

సత్తెనపల్లి: ఆరోగ్య సంరక్షణ ప్రతి విద్యార్థికి రక్షణ అని, ప్రస్తుత పరీక్షల సమయంలో ఆరోగ్యం బాగుంటేనే మంచి విజయాలను సాధించగలరని తెలంగాణ రాష్ట్ర సీఎస్సీ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ పీవీపీ అంజనీకుమారి అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత దంత పరీక్షలు, మందులు, టూత్ పేస్ట్, బ్రష్‌ల పంపిణీ శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. నోటి శుభ్రత అన్ని వ్యాధులను దూరం చేస్తుందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు హెల్ప్ ఫౌండేషన్ చేపట్టడం అభినందించదగ్గ విషయమన్నారు. పట్టణానికి చెందిన శ్రీ సాయి కృష్ణ డెంటల్ కేర్ హాస్పిటల్ వైద్యుడు పి.శివరామకృష్ణ మాట్లాడుతూ దంత సంరక్షణపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలన్నారు. క్రమం తప్పకుండా రోజుకు రెండుసార్లు దంతాలను శుభ్ర పరచుకోవాలన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ సదుపాయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొక్కలు నాటారు. వైస్ ప్రిన్సిపాల్ కంచర్ల శిరీష్ బాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు సురేష్, సోమశేఖర్, టీచర్ మస్తాన్ ఐటీవి కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నరసరావుపేట: స్థానిక డిపో కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్‌యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ వీవీఎస్ కుమార్ బుధవారం పేర్కొన్నారు. పట్టణ, గ్రామాలకు చెందిన ప్రజలు ప్రయాణానికి అవసరమైన సలహాలు, సూచనలు సెల్ నం. 99592 25428కు ఫోన్ చేసి తెలియచేయాలని కోరారు.

3న ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు పోటీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మిట్టపల్లి కోటేశ్వరరావు

నరసరావుపేట రూరల్: గుంటూరు గ్రూప్ పరిధిలోని ఎన్‌సీసీ క్యాడెట్స్ అంతర కళాశాలల పోటీలు ఫిబ్రవరి 3వ తేదీన నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నట్టు కళాశాల చైర్మన్ మిట్టపలి వెంకటకోటేశ్వరరావు తెలిపారు. కళాశాలలో బుధవారం పోటీల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్‌ఈసీ కళాశాల జూబ్లీషన్ 2కే-25లో భాగంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఎన్‌సీసీ డైరక్టరేట్, గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్ హెడ్ క్వార్టర్స్ అనుమతితో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్లటూన్ డ్రిల్, గార్డ్ ఆఫ్ హన ర్, అబ్స్టాకిల్ రన్, టగ్ ఆఫ్ వార్, గ్రూప్ డాన్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయని వివరించారు. గుంటూరు గ్రూప్ పరిధిలోని ఐదు జిల్లాల నుంచి 400 మంది క్యాడెట్స్ పోటీలో పాల్గొంటారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో మొదటి సారిగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. క్యాడెట్స్‌లో పోటీతత్వం, టీమ్ వర్క్, క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకునేందుకు పోటీలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్ బాబు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీరు పారుదలపై ఘర్షణ

బొల్లాపల్లి: ఇరువురు మహిళల మధ్య మురుగునీరు పారుదల విషయంలో వివాదం నెలకొని ఘర్షణకు దారి తీసి ఒక మహిళ ఇంటిపై మరో మహిళ వర్గీయులు దాడులకు పాల్పడిన సంఘటన మండలంలోని సోలాయపాలెంలో జరిగింది. బండ్లమోటు పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన అన్నంగి కోటమ్మకు చెందిన ఖాళీస్థలంలో వలస వచ్చిన మిరప కూలీలు ఉంటున్నారు. ఈ కూలీలకు చెందిన మురుగునీరు లాగా లక్ష్మి ఇంటి ముందుకు వస్తుండగా మురుగునీరు రానివ్వకుండా చూడమని చెప్పడంతో వివాదం నెలకొంది. వివాదం కాస్త ముదిరి ఘర్షణకు దారి తీసింది. అన్నంగి కోటమ్మ వర్గీయులు కొందరు రాళ్లు, కర్రలతో లాగా లక్ష్మి ఇంటిపైకి దాడి చేసి తీవ్రంగా కొట్టడంతో లక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం మేరకు పోలీసులు గ్రామానికి చేరుకొని పరిస్థితిని అదుపు చేసి లక్ష్మిని వినుకొండలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. మరొక వర్గానికి చెందిన అన్నంగి కోటమ్మ, అన్నంగి రామకోటయ్యలకు గాయాలయ్యాయి. వీరిరువురు వినుకొండలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు బండ్లమోటు ఎస్ఐ ఎ.బాలకృష్ణ తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

అగ్రహారం, ఈనాం భూములకు హక్కులు కల్పించాలి



మంత్రి రవికుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

నూజెండ్ల(శావల్యాపురం): అగ్రహారం ఈనాం భూములకు హక్కులు కల్పించాలని నూజెండ్ల మండల రైతులు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌కు వినతి పత్రం బుధవారం అందించారు. రైతులు తెలిపిన సమాచారం మేరకు రాష్ట్ర ప్రజావేదిక కార్యక్రమంలో భాగంగా నూజెండ్ల మండలం నుంచి వి.అప్పాపురం, తిమ్మాపురం, గ్రామాల్లో సుమారు 4 వేల ఎకరాలు సాగు భూములు ఉండగా 700 మంది రైతులు కొన్ని సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్నామని, ప్రభుత్వ పరంగా పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయకపోవటంతో పాటు భూహక్కులు కల్పించక పోవటంతో ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీ కోల్పోతున్నామని, అలాగే బ్యాంకు రుణాలు పొంద లేకపోతున్నామని, క్రయ విక్రయాలు చేసుకోలేకపోతున్నట్లు రైతులు మంత్రి దృష్టికి తెచ్చారు. నడికూడి-శ్రీకాళహస్తి రైల్వే నిర్మాణం కోసం చేపట్టిన భూసేకరణలో తమ భూములు 22ఎ జాబితాలో ఉన్నాయనే సాకుతో నష్టపరిహారం ఇవ్వలేదని, కొత్త జడ్డావారిపాలెం నుంచి పారా సుబ్బులు, గొట్టిపాటి వెంకటేశ్వర్లు, కట్టింపూడి ధనమ్మ, మంత్రి ఎదుట వాపోయారు. అలాగే మూర్తింజాపురం, మారెళ్ళవారిపాలెం, గ్రామస్తులు గ్రామంలోని విద్యుత్ సమస్యలపై పిర్యాదు చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ముండ్రు సుబ్బారావు, నక్కా బుల్లీశ్వరరెడ్డి, కంచుమాటి నరేష్, అమరా వెంకటేశ్వర్లు, పేరం సుధాకర్‌రెడ్డి, కోట వెంకటేశ్వర రెడ్డి, రైతులు తదితరులు ఉన్నారు.

మంచి ఫలితాలు కోసం సాధన చేయండి

జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

శావల్యాపురం: పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాల సాధన కోసం కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్. చంద్రకళ అన్నారు. బుధవారం మండలంలోని బొందిలిపాలెం, మతుకుమల్లి గ్రామాల్లో ఎంపీపీ, జడ్పీ ఉన్నత పాఠశాలలను డీఈవో చంద్రకళ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా డీఈవో చంద్రకళ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి ఉపాధ్యాయులు బాధ్యత వహించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు అందజేసిన విద్యార్థి సాధన మెటీరియల్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు మెను ప్రకారం జరగాలని ప్రభుత్వ నిబంధనలు తూచ తప్పకుండా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. అనంతరం ఎఫ్-3 పరీక్షలు రాస్తున్న విద్యార్థుల తీరును పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

గ్రామాల్లో అక్షరాస్యులు పెరగాలి



మెటీరియల్ చూపుతున్న అధికారులు

బొల్లాపల్లి : ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఇన్‌చార్జి ఎంపీడీవో, ఉల్లాస్ మండల చైర్మన్ పి.సీతారామయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. మొదటి విడతగా ఒక్కొక్క గ్రామంలో 10 మంది మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే ప్రక్రియ మొదలని, ఈ కార్యక్రమానికి ఒక్కొక్క గ్రామానికి ఒక వలంటీర్‌ను నియమించడం జరిగిందని తెలిపారు. మూడు నెలల కాల పరిమితిలో మహిళలను అక్షరాస్యులుగా తయారు చేయాలన్నారు. స్వచ్ఛందంగా వేలి ముద్రలు లేకుండా సంతకం చేసే విధంగా అక్షరాలను నేర్పించడమే ఈ కార్యక్రమం ప్రాముఖ్యత అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 18 నుంచి 60 సంవత్సరాల వయసు గల నిరక్షరాస్యులైన మహిళలను ఉల్లాస్ కార్యక్రమంలో అక్షరాసులుగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వెలుగు పథకం ఏపీఎం పి.వి.రంగారెడ్డి, సీసీలు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో పశువైద్యశిబిరాలు



మహిళా రైతుకు మందులు అందజేస్తున్న డాక్టర్ రామారావు



గేదెలకు నట్టల నివారణ మందు వేస్తున్న దృశ్యం

రొంపిచర్ల: మండలంలోని కొత్తపల్లి, కర్లకుంట, మునుమాక గ్రామాల్లో బుధవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన పశువైద్యశిబిరాన్ని పశు సంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామారావు సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పశు వైద్యశాఖ ద్వారా పశువులకు అందిస్తున్న సేవలు గురించి, పథకాల గురించి వివరించారు. ఆయా గ్రామాలలో జరిగిన పశువైద్యశిబిరాల్లో పశు వైద్యాధికారులు డాక్టర్ సాయి మహేష్ రెడ్డి, డాక్టర్ వంశీ ప్రసాద్‌లు పాల్గొని గేదేలకు, దూడలకు వివిధ వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగ నిర్ధారణ అనంతరం అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. లేగ దూడలకు, గేదెలకు నట్టల నివారణ మందులు అందజేశారు. గొర్రెలకు టీకాలు, పశువులకు మందగొండు శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, గోపాల మిత్రలు, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర పశువులతో రైతుకు ఆదాయం

నాదెండ్ల: పశువుల ఆరోగ్యం పట్ల యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకుంటేనే పాడిపోషణ లాభసాటిగా ఉంటుందని సాతులూరు పశువైద్యాధికారి శ్రీలక్ష్మి చెప్పారు. బుక్కాపురం గ్రామంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు వ్యవసాయానికి తోడు పాడిపశువులు అదనపు ఆదాయాన్ని చేకూరుస్తాయన్నారు. పశువులకు నట్టల నివారణ మందులు అందించారు. చూడి నిర్ధారణ పరీక్షలు, చూడి కట్టిన గేదెలకు సంపూర్ణ మిశ్రమ దాణాను అందించారు. కృత్రిమ గర్భధారణ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాసరావు, ఖుదాన్ షా, గోపీ, రజనీకాంత్, సత్యవతి, హబీబ్, సుభాని, నాయకులు పాల్గొన్నారు. గురువారం కనపర్రు గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నట్టల నివారణ మందులు అందజేత

చిలకలూరిపేట: పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాల్లో భాగంగా బుధవారం మండలంలోని కావూరు, లింగంగుంట్ల గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో కావూరు పశువైద్యాధికారి డాక్టర్ పి రవీంద్ర, పసుమర్రు పశువైద్యాధికారి డాక్టర్ పి.దీప్తి పాల్గొని పశువులకు వైద్య చికిత్సలు నిర్వహించారు. 124 గేదెలు, దూడలకు నట్టల నివారణ మందు అందజేశారు. 21 గేదెలకు గర్భకోశవ్యాధి సంబంధించిన చికిత్సలు అందించారు. పశువుల ఆరోగ్య సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు.

గంగాదేవీ తిరుణాళ్ల హక్కుల వేలం మళ్లీ వాయిదా

క్రోసూరు: అచ్చంపేట మండలంలోని ఓర్వకల్లు గ్రామంలో ఈనెల 12న జరిగే గంగాదేవీ పేరంటాళమ్మ తిరునాళ్ల కోసం నిర్వహించే హక్కుల వేలం తిరిగి వాయిదా పడినట్లు ఈఓ ఎం.కోటేశ్వరరావు బుధవారం తెలిపారు. పాటకు సభ్యులు ఎవరూ ముందుకు రాకపోవటంతో వాయిదా పడినట్లు తెలిపారు. ఇప్పటికే రెండుసార్లు వేలం వాయిదా పడినట్లు తెలిపారు.